


# నీ ఇల్లు గుల్లగాను

- అద్దేపల్లి జ్యోతి

ఉగాది పోటీలో ఎంపికైన కథ

**ఆ రాత్రి కలలు ఆ పుస్తకంలో ప్రశ్నలే అడిగినట్టు, తను గబగబా సమాధానాలు చెప్పేసినట్టు, తనకి ఫ్లాట్ లభించినట్టు తీయతీయని కలలు. అందుకే ఆ కల నిజమవుతుందని భర్త లాస్ ఆఫ్ పే అని ఏడ్చినా పట్టించుకోకుండా సెలవు పెట్టించి లక్షలు వస్తుంటే వందలకోసం ఏడుస్తారా అంటూ టీ.వీ. ముందు కూర్చోపెట్టింది.**

'నీ అసాధ్యం కూలా' ప్రోగ్రామ్‌కి స్వాగతం, సుస్వాగతం. మా ప్రోగ్రామ్‌కోసం అప్పనంగా మేమిచ్చే ప్రైజ్‌లు కొట్టేయ్యటంకోసం మీరంతా గోతికాడ నక్కల్లా కాసుక్కూచుంటారని మాకు తెల్సు. అందుకే కొంచం లేటుగా ప్రోగ్రామ్ మొదలెట్టాం. 'హ్హిహ్హి. ఈలోపు మీరు ఏమయిందీ ప్రోగ్రామ్ మొదలవలేదూ అంటూ గడియారంకేసీ టీవీకేసీ చూస్తూ జుట్టు పీక్కుంటున్నారా? చాలు ఇంక జుట్టు సరి చేస్కుని ఫోన్ రడీగా పట్టుకుని కూర్చోండి' అంటూ కాళ్ళూచేతులూ కదుపుతూ విపరీతమైన హావభావాలతో ఆ ఏంకర్ వీరంగం కడుతోంది టీ.వీ.లో.

వీరలక్ష్మి ఆత్రంగా టీ.వీ.నే చూస్తోంది కనురెప్ప వేయకుండా. ఒక చేతిలో సెల్‌ఫోన్, ఒక చేతిలో లేండ్ ఫోన్. ఎదురుగా కాయితం, పెన్. యుద్ధానికి వెళ్ళే వీర జవాన్‌లా అంత అప్రమత్తంగా కూర్చుంది.

ఆ ఏంకర్ అడిగే ప్రశ్నకి టకీమని సమాధానం చెపితే పట్టుచీర కానీ, ఫ్లాట్ కానీ, కారు కానీ ప్రైజ్‌గా ఇస్తామని హోరెత్తిస్తున్నారు. అందుకని భర్త వెంగళ్రావ్‌ని ఆఫీస్ మాన్పించి మరీ మా చెత్త ప్రశ్న మీ పిచ్చి జవాబు పుస్తకం ప్రత్యేకం ఈ ప్రోగ్రామ్ స్పాన్సరర్సే వేయించారు. ఈమధ్యే రిలీజయిన ఆ పుస్తకాన్ని ప్రముఖ రాజకీయవేత్తతో ఆవిష్కరణ చేయించారు. ఆ రోజు పోరాడిమరీ గెల్చుకుంది పుస్తకాన్నీ. చీర చివరిగా పట్టించుకోలేదు. ఆ జనంలో దూరిపోయి మరీ కొనుక్కుంది. ఆ రాత్రి కలలు ఆ పుస్తకంలో ప్రశ్నలే అడిగినట్టు, తను గబగబా సమాధానాలు చెప్పేసినట్టు, తనకి ఫ్లాట్ లభించినట్టు తీయతీయని కలలు. అందుకే ఆ కల నిజమవుతుందని భర్త లాస్ ఆఫ్ పే అని ఏడ్చినా పట్టించుకోకుండా సెలవు పెట్టించి లక్షలు వస్తుంటే వందలకోసం ఏడుస్తారా అంటూ టీ.వీ. ముందు కూర్చోపెట్టింది. రాత్రీ పగలూ ఆ పుస్తకం వదలటం లేదు. కళ్ళు వాచిపోయి ఇంతింత బాదం కాయిల్లా అయిపోయి రాలిపోయేలా వున్నా చదవటం, టీ.వీ. చూడటం మానలేదు.

ఇంకో ముఖ్య విషయం. ఇందులో మనం విన్ అయ్యేవరకూ వంట చేయనని భీష్మ ప్రతిజ్ఞ చేసింది. వెంగళ్రావ్‌కి ఏడుపొక్కటే తక్కువ. తడిసి మోపెడవుతున్న సెల్‌ఫోన్ ఛార్జీలు, ఎస్ఎమ్ఎస్‌లు, లేండ్‌లైన్ ఖర్చులూ ఏదో ఒక టీ.వీ. ప్రోగ్రామ్‌కోసం చేస్తూ వుండటంవల్ల ఆఫీసునుంచి అవసరం అయి ఫోన్ చేస్తే ఎప్పుడూ ఎంగేజే. అవికాక హోటల్ ఖర్చులు భోజనం, టిఫిన్ ఖర్చులు, ఫోన్స్ చేసి చేసీ వేళ్ళు నొప్పి పెడుతున్నాయి. ఎవరినైనా బోయ్‌ని పెట్టండి డయల్ చేస్తాడు. రింగ్ అయి లిఫ్ట్‌చేస్తే అప్పుడు నేను మాట్లాడతాను అంటోంది. కాల్ దొరక్కపోతే చెప్పిచ్చి కొట్టుకో ప్రోగ్రామ్ అట కొత్తగా మొదలవుతోందట. ఫోన్ నంబర్ రాసి వాళ్ళకి పంపాలట. కాంపిటీషన్ కార్డు పది రూపాయలట. స్పెషల్‌గా ఈ ప్రోగ్రామ్‌కోసం ప్రవేశపెట్టినవి మాత్రమే వాడాలట. వాళ్ళు ఫోన్ చేస్తారట. ఆ ఫోన్ లిఫ్ట్ చేయగానే కాల్ దొరికింది. చెప్పిచ్చుకొట్టుకో అనాలట. అలా అనకుండా హలో అంటే డిస్క్వాలిఫై అట. ఇక ఏ ఫోన్ వచ్చినా కాల్ దొరికింది. చెప్పిచ్చు కొట్టుకో అనటం చాలా ఎంబ్రాసింగ్‌గా వుంది వెంగళ్రావ్‌కి. మొన్న వాళ్ళాఫీసర్ ఫోన్ చేస్తే ఈవిడగారు ఫోన్ ఎత్తి కాల్ దొరికింది చెప్పిచ్చుకొట్టుకో అందిట. ఆయన హడిలిపోయి మీ ఇంటికి ఫోన్ చేసాను. రాంగ్ నంబర్ వెళ్ళిందనుకుంటా. ఎవరో పిచ్చి పిచ్చిగా మాట్లాడుతున్నారు అన్నారు. ఓ వెర్రి నవ్వు నవ్వి ఈమధ్య రాంగ్ నంబర్స్ ఎక్కువయిపోతున్నాయి అంటూ ఏదేదో మాట్లాడి ఆయన్ని మొత్తానికి కన్ఫ్యూజ్ చేసేసాడు.

మర్నాడు ఆఫీస్‌కి టైమ్ అయిపోతోందని గబగబా రడీ అయి ఫైల్‌కోసం అలమార తీస్తే దాన్నిండా వాడేసిన సబ్బు కవర్స్, తినేసిన చాక్లెట్ కాయితాలు, సినిమా టిక్కెట్లు దర్శనం ఇచ్చాయి.

'వీరలక్ష్మీ' అంటూ ఒక్క అరుపు అరిచాడు. 'ఏంటండీ'అంటూ వచ్చింది. ఏదో లాటరీలో ప్రైజ్ కొంచంలో పోయినట్టు ఎందుకంత గట్టిగా అరిచారు' అంది. 'ఉన్న టీ.వీ. పిచ్చి సరిపోలేదా? లాటరీ అంటున్నావ్' అని అరిచి 'అవునూ డస్ట్‌బిన్ కొన్నాను కదా మరి దీన్ని డస్ట్‌బిన్‌లా వాడుతున్నావే' అన్నాడు.

'హ్హా, హ్హా'అంటూ మాయల ఫకీరులా నవ్వి ఇంతవెర్రి వెంగళ్ళప్పవి కనుకే మీ అమ్మావాళ్ళు వెంగళ్రావ్ అని పేరుపెట్టారు అంది కిసాకిసా నవ్వుతూ.

'చాల్లే సంబడం, ఈ తుక్కు ఏంటీ అంటే నా పేరు గోల నీకెందుకు అసలు విషయం చెప్పు' అన్నాడు కోపంగా.

'ఈమధ్య చూసిన సినిమా టిక్కెట్లు పంపితే ఇద్దర్ని సింగపూర్ పంపారు. అలా మళ్ళీ ఏదన్నా పెడతారేమోనని సినిమా టిక్కెట్లు దాచా. అందులో కొన్ని మనం చూడని సినిమా టిక్కెట్లు కూడా వున్నాయి. అవి పనిమనిషికి డబ్బులిచ్చి టికెట్స్ తెప్పించినవి' అంటూ అతి రహస్యంగా చెప్పింది ముసిముసిగా నవ్వుతూ. 'ఇలా కూడా నా డబ్బు తగలేస్తున్నావా?' అని లోపల తిట్టుకుని 'మరి ఈ చాక్లెట్, సబ్బుకాయితాలూ' ఎందుకే? అన్నాడు చిరాగ్గా.

'ఒక సబ్బు రేపర్ ఇస్తే కొత్త సబ్బు ఇచ్చారు గుర్తుందా? అలా మళ్ళీ పెడతారేమోనని' ఆ చాక్లెట్ కంపెనీవాడు కూడా ఇలాంటి ఆఫర్ పెడతాడేమోనని ముందుచూపుతో బాబిగాడూ, వాడి ఫ్రెండ్స్ తిన్న చాక్లెట్ కాయితాల్ని జాగ్రత్తగా తెమ్మన్నా'అని ఒక లుక్ ఇచ్చింది. ఇంత అమాయకుడివి ఎలా బ్రతుకుతావురా అన్నట్టు చూసి చాల్లెండి మీ పిచ్చి డవుట్లు. నాకు టీ.వీ.లో ఆశ, దోశ, అప్పడం, వడ ప్రోగ్రామ్ టైమ్ అయిపోతోంది అంటూ ఎన్నో ఏళ్ళ విరహం తర్వాత

ప్రియుణ్ణి కలుసుకునే ప్రియురాలిలా టీ.వీ. గదిలోకి వెళ్ళిపోయింది. పట్టువదలని ఆడ విక్రమార్కురాలిలాగా ఫోన్ ట్రయ్ చేస్తూనే వుంది. ఆరోజు ఆదివారం ఆఫీసు లేదు. కనీసం హోటల్ బిల్లు ఒక రోజుది అయినా తగ్గిద్దాం అని వంటింట్లో వేళ్ళు కోసుకుంటున్నాడు వెంగళ్రావ్. 'వీరలక్ష్మి ఒక్క గావుకేక పెట్టింది లైన్ దొరికింది. నన్ను లైన్‌లో వుండమన్నారూ' అంటూ. అర్ధగంట నిరీక్షించాకా వీరలక్ష్మిని మాట్లాడమన్నాడు ఫోన్ లిఫ్ట్‌చేసిన మనిషి. హాయ్ అటు ఎవరూ అంది ఏంకర్ ఎక్కడ లేని వంకర్లూ పోతూ. 'నేను, వీరలక్ష్మిని, అంది ఎంతో ఏంగ్జయిటీ'గా వీరలక్ష్మి.

'హాో, వీరలక్ష్మిగారూ బాగున్నారా? ఈరోజు వంట ఏం చేశారు. నేనూ భోజనానికి రానా అంది ఏంకర్ తిండి మొహం ఎరుగని దానిలా.

'నీ బొంద, మాకే వంట చేయట్లేదు. మీ దిక్కుమాలిన ప్రోగ్రామ్స్ వల్ల ఇంక నీకేం పెడుతుంది' అని లోపలే సణుక్కున్నాడు వెర్రి వెంగళ్రావ్.

'వీరలక్ష్మి ఏదో అనేలోగా' ఇప్పుడు మా చెత్త ప్రశ్నకి మీ పిచ్చి జవాబు రడీనా అంటూ పది మధ్యలో సున్నా పెడితే ఏమవుతుంది. ఆలోచిస్తూ మా ఛానలే చూస్తూ వుండండి. ఇప్పుడే మేం పగలకొట్టుకుని వస్తాం అర్థం కాలేదా బ్రేక్'అంటూ బల్లమీద ఒక్క దెబ్బవేసింది. ఆ బల్ల ముక్కలన్నీ అంతా పరుచుకున్నాయి విరామం అంటూ.

'వీళ్ళ పైత్యం తగలెయ్య. మళ్ళీ అది లైన్లోకొచ్చే



'వీళ్ళ పైత్యం తగలెయ్య. మళ్ళీ అది లైన్లోకొచ్చే వరకూ అలా ఫోన్లో లైన్లో వుంటావా అన్నాడు వెంగళ్రావ్ విష్ణుచక్రంలా తిరిగే ఫోన్ బిల్లు గుర్తొచ్చి గుటక పడలేదు. 'అలా మిడిగుడ్లు వేసుకు చూడకపోతే పది మధ్యలో సున్నా పెడితే ఏమవుతుందో చెప్పి చావచ్చు కదా! నాకు టెన్షన్‌తో బుర్ర పనిచెయ్యట్లేదు'

వరకూ అలా ఫోన్లో లైన్లో వుంటావా అన్నాడు వెంగళ్రావ్ విష్ణుచక్రంలా తిరిగే ఫోన్ బిల్లు గుర్తొచ్చి గుటక పడలేదు. 'అలా మిడిగుడ్లు వేసుకు చూడకపోతే పది మధ్యలో సున్నా పెడితే ఏమవుతుందో చెప్పి చావచ్చు కదా! నాకు టెన్షన్‌తో బుర్ర పనిచెయ్యట్లేదు'అంటూ మొగుడ్ని మోచేత్తో పొడిచింది.

'ఆ దెబ్బకి పోవే పందీ అనేసాడు'పైకే.

'ఆ కరెక్ట్ ఎన్నాళ్ళకి కరెక్ట్‌గా సమాధానం చెప్పారు ఇక ఫ్లాట్ మనదే' అంది.

'ఆ అని నోరు తెరిచాడు. తన భార్య ఇంత స్పోరిటివ్‌గా ఎప్పుడు తయ్యారయ్యిందా'అని. ఇంతలో ఆ ఏంకర్ తెర మీదికొచ్చింది. వీరలక్ష్మిగారూ లైన్‌లోనే వున్నారా మీ పిచ్చి జవాబు ఏదీ అంది?

'పోవే, పందీ' అనేసింది వీరలక్ష్మి.

'హ్హాహ్హా అని ఏంకర్ నవ్వి మా చెత్త ప్రశ్నకు మీ పిచ్చి జవాబు పోవే పంది కాదు పది మధ్యలో సున్నా పెడితే వంద సారీ, బెటర్‌లక్ నెక్స్ట్ టైమ్ ఈసారి బాగా మా పుస్తకం చెత్త ప్రశ్న, పిచ్చి జవాబు బాగా చదివి బాగా ప్రిపేర్ అయి ఫోన్ చేయండి. మీ కాలం ఖర్మం కల్సి వస్తే ప్రైజ్ మీదే' బై అంటూ ఫోన్ పెట్టేసింది తిప్పుకుంటూ.

'మిమ్మల్ని తగిలెయ్య. నా జవాబు నేనే చెప్పుకోవాల్సింది అనవసరంగా మిమ్మల్ని అడిగాను. రాక రాక ఫోన్ దొరికితే మీవల్ల నా కల నిజం కాకుండా పోయింది ఛీ అంటూ మొగుడ్ని కొట్టినంత పనిచేసింది వీరలక్ష్మి.

'తల్లీకూతురు ప్రోగ్రామ్ అట. అందులో పాల్గోడానికి వాళ్ళ అమ్మని గొడవచేసి ఒప్పించింది. ఆవిడ నేను మాట్లాడతాను మొర్రో అన్నా విన్పించుకోకుండా లాక్కుపోయింది ఆవిడ్ని స్టూడియోకి. ఆవిడ సరిగ్గా మాట్లాడలేకపోయింది. తర్డ్ ప్రైజ్ వచ్చింది. ఆవిడని తిట్టిపోసింది. ఎంత ట్రైనింగ్ ఇచ్చాను సరిగ్గా మాట్లాడలేకపోయావు. లేకపోతే మనకే ఫస్ట్ ప్రైజ్ వచ్చేది'అంటూ ఆవిడ్ని సాధించింది.

వీళ్ళు పాల్గొన్న ఆ ప్రోగ్రామ్ వచ్చేరోజు చూడాలి హడావిడి ఎన్ని ఫోన్లో ఎన్ని ఫోన్లో చుట్టం అన్న ప్రతీ వాళ్ళకీ ఫోన్‌చేసి చెప్పింది. రోడ్ మీద వెళ్ళే వాళ్ళని కూడా ఆపి మరీ చెప్పింది. మా ప్రోగ్రామ్ వస్తుంది చూడమని. వెంగళ్రావ్‌కి సిగ్గేసింది. ముక్కు మొహం తెలీని వాళ్ళకి అలా చెబుతుంటే ఆ టీ.వీ వాళ్ళు ఇచ్చిందానికన్నా పది రెట్లు ఎక్కువ ఖర్చు అయింది ఫోన్లకీ. ఫ్రెండ్స్ టీ.వీ.లో కనపడుతున్నావ్ కదా పార్టీ అన్నారని స్టార్ హోటల్‌లో పార్టీ ఇచ్చింది దానికీ బోల్డు ఖర్చు.

వెంగళ్రావ్‌కి విసుగొచ్చేస్తోంది జీవితం అంటే. ఈ టీ.వీ. పిచ్చిలో పిల్లాడిని సరిగ్గా చూడట్లేదు అని హాస్టల్‌లో వేసేసాడు. ఆ శెలవలకి వచ్చినపుడే ఇల్లు నరకంలా వుంటోంది. వాడు కార్టూన్, పోగో అని ఈవిడేమో ఆ చానల్, ఈ ఛానల్ అని ఆ శెలవలు ఎప్పుడయి వాడు హాస్టల్‌కి వెళ్ళిపోతాడా అన్పిస్తోంది.

ఈ సమస్యకి పరిష్కారం లేదా? విరుగుడు లేదా? తరుణోపాయం ఏమిటి? సమాధానం ఏమిటి అని అనుకున్నాడు? ఇదేంటీ నేను కూడా టీ.వీ. సీరియల్‌లో లాగా ఒకే ప్రశ్నని ఇన్ని రకాలుగా అడుక్కుంటున్నాను. ఓరి దేవుడా నేను కూడా ఇలా తయ్యారయిపోతున్నాను. నువ్వే రక్షించు అన్నాడు.

అతని మొర ఆలకించినట్టు ఆరోజు పేపర్లో ఏదో యాడ్ సరిగ్గా చూస్తే అది ఒక సైక్రియాట్రిస్ట్ ఇచ్చింది.

మీరు వ్యసనపరులా

మీరు జూదరులా

మీరు తాగుబోతులా

మీరు టీ.వీ. బాధితులా

వెంటనే మమ్మల్ని సంప్రదించండి. మీ సమస్యని చిటికెలో మాయం చేస్తాం అని.

వెంగళ్రావ్ ఎవరెస్ట్ ఫస్ట్‌టైమ్ తానే ఎక్కినంత సంబరపడిపోయి ఆ ఫోన్ నెంబర్‌కి డయల్ చేయటం మొదలుపెట్టాడు.

తన సమస్య తీరిపోయి తన 'ఇల్లు గుల్ల' కాకుండా ఆ దేవుడే తనకోసం ఆ సైకియాట్రిస్ట్‌ని పంపాడని గంపెడాశతో ఫోన్ చేస్తున్నాడు. మనం కూడా పాపం వెంగళ్రావ్‌కి ఆల్ ది బెస్ట్ చెబుదాం. ★